సాక్షి నిర్మల్

బుధవారం • 3 • జూలై • 2024



ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ

బాసర ట్రిపుల్ఐటీకి పోటీ తగ్గింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తులు సగానికి తగ్గాయి. మెరిట్ జాబితాను అధికారులు బుధవారం విడుదల చేయనున్నారు. 8లో▸



కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు

నిర్మల్ నియోజకవర్గాన్ని కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తానని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.4 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో ఒకటి రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రామీణప్రాంత ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్



మాట్లాడుతున్న వెంకట్రావ్

కడెం: ఉపాధ్యాయ బదిలీల్లో గ్రామీణా ప్రాంత, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్ కోరారు. మండలంలోని చిన్నబెల్లాల్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతీ పాఠశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి సాంకేతిక విద్యనందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, రాష్ట్ర నాయకులు ధర్మాజీచందనే, కాంత్రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం నుంచి గత మూడు సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయించాలని నిర్మల్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కోరింది. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ టోకెన్లను విడుదల చేయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, మూడేళ్లుగా ప్రభుత్వం ద్వారా స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో కాలేజీలు నడుపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జి.నరేశ్‌గౌడ్, స్టేట్ ఈసీ మెంబర్లు సాయిలు, వెంకట్‌రెడ్డి, అఖిలేష్ కుమార్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ ఖరారు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల వైకల్య ధ్రువీకరణ కోసం జూలై నెలకు సంబంధించి సదరం క్యాంపుల తేదీలను జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి విజయలక్ష్మి ప్రకటించారు. జులై 5, 19 తేదీల్లో ఆరోథ అంగవైకల్యం, సీపీఏ, 10న వినికిడి, 16న మానసిక దివ్యాంగులకు, 24న కంటి సంబంధిత శిబిరాలు ఉంటాయని వివరించారు. అర్హులైన వారు తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యునితో అవుట్ పేషెంట్ స్లిప్ ద్వారా దివ్యాంగ కేటగిరీ నిర్ధారించుకుని దాని ప్రకారం మీ సేవలో ఈనెల 3వ తేదీ నుంచి రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకోవాలని వివరించారు. స్లాట్ బుక్ చేసుకున్నవారు మాత్రమే క్యాంపులకు ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రావాలని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. కస్బా మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల, భోజనాల గది, డార్మెటరీ, సామగ్రి భద్రపరిచే గదిని పరిశీలించారు. భోజనం తయారు చేసే ముందు, వడ్డించే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సిబ్బందికి సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తనిఖీల్లో రవీందర్, లక్ష్మి సాయమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

మత్తు వదిలేలా..



గంజాయి విక్రయిస్తున్న టేలాలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- 'మత్తు' వదిలేలా పోలీసుల చర్యలు
- అడ్డాలపై వరుస దాడులు
- నిషేధిత గుట్కాలపైనా నజర్
- జిల్లా కేంద్రంలో టేలాల తొలగింపు

నిర్మల్: గంజాయి మత్తు యువతను పీల్చేస్తోంది. వారి నిండు జీవితాలను పిప్పిచేస్తోంది. కుటుంబాలనూ కలవరపెడుతోంది. చివరకు బడిపిల్లలూ ఈ మత్తు బారినపడుతున్నారంటే.. అది ఎంతవరకు చొచ్చుకువెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈనేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం మత్తుపదార్థాల నుంచి యువతను కాపాడటం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాలోనూ పోలీసులు, అధికారులు మత్తు పదార్థాల విక్రయాలపై గురి పెట్టారు. గంజాయి అడ్డాలపై దాడులు చేస్తున్నారు. వీటి అమ్మకాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా.. వెంటనే స్పందిస్తున్నారు. నిషేధిత గుట్కా అమ్మకాలపైనా సీరియస్‌గా చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని రెండు టేలాలనూ తొలగించారు.

విరివిగా అమ్మకాలు..

ఒకప్పుడు చాటుమాటుగా సాగిన గంజాయి దందా ఇటీవల బహిరంగంగానే సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ పలు అడ్డాల్లో విరివిగా గంజాయి దొరుకుతోంది. గతంలో ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ఒకరిద్దరు యువకులు గంజాయి తీసుకుని వచ్చి, మిగతా అందరికీ పంపిణీ చేసేవారు. శివారు, అటవీ ప్రాంతాల్లో సేవించేవారు. ఇప్పుడు స్థానికంగానే గంజాయి లభిస్తుండటంతో లోకల్‌గానే అడ్డాలు పెట్టుకుంటున్నారు. పట్టణాల్లో పోలీసుల నిఘా పెరగడంతో ఇటీవల 44వ జాతీయరహదారిపై బైక్‌పై వచ్చి గంజాయిని విక్రయించి వెళ్తున్నట్లు సమాచారం. పట్టణంలోని పలు శివారు కాలనీల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని హోటళ్లలో బహిరంగంగానే విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

'ప్రత్యేక' బృందాలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోనూ సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు వెల్లడిస్తున్నారు. గంజాయిని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలనూ ఏర్పాటు చేశారు. ఈమేరకు గంజాయి విక్రేతలు, సాగు, సేవిస్తున్న అడ్డాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. మరోవైపు గంజాయి సహా మాదకద్రవ్యాల బారినుంచి యువతను కాపాడుకోవడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

అడ్డాలపై దాడులు..

ఫిర్యాదులు వచ్చిన తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికారులు వెంటనే స్పందిస్తున్నారు.గంజాయితోపాటు గుట్కాలపైనా పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. తాజాగా జిల్లాకేంద్రంలోని పలు టేలాల్లో గుట్కాలతోపాటు గంజాయి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన సదరు టేలాలను తొలగించారు. గంజాయితోపాటు నిషేధిత గుట్కాలు విక్రయిస్తే మరిన్ని చర్యలను చేపడతామని హెచ్చరించారు.

ప్రభుత్వం సీరియస్..

మత్తుపదార్థాలపై కొత్త ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. పదేళ్లకాలంలో రాష్ట్రవ్యాప్తంగా గంజాయిసహా పలు మాదకద్రవ్యాల విక్రయాలు, వాడకం విపరీతంగా పెరిగింది. జిల్లాలోనూ ఇటీవల గంజాయి వాడకం గణనీయంగా పెరుగుతోంది. పట్టణాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు సైతం ఈ మత్తుకు అలవాటుపడ్డట్లు తేలడం కలవరపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ యువకులు చాలావరకు మత్తుకు బానిస అవుతున్నారు. జిల్లాలో గంజాయి తాగని ఊరు లేదంటే అతిశయోక్తి కాదు. ఈనేపథ్యంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో.. జిల్లాలోనూ అధికారులు గంజాయిపై ఫోకస్ పెట్టారు.

సమాచారం ఇవ్వండి..



గంజాయిసహా మత్తుపదార్థాలను అరికట్టడం, యువతను కాపాడుకోవడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీరియస్‌గా చర్యలు చేపడుతున్నాం. –జానకీషర్మిల, ఎస్పీ

పల్లెల్లో 'మీ సేవ'..!

- మహిళాశక్తి పేరిట ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం
- మహిళా సంఘాలకు మంజూరుతో ప్రయోజనం

జిల్లాలో ఇలా..	
ఎస్‌హెచ్‌జీలు	12,002
సభ్యులు	1,35,877
గ్రామపంచాయతీలు	396



మీసేవ కేంద్రం

భైంసాటౌన్: ఇప్పటివరకు పట్టణ ప్రాంతాలకు పరిమితమైన మీసేవ కేంద్రాలు ఇక గ్రామాల్లోనూ ఏర్పాటు కానున్నాయి. ఊరికో మీసేవ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేయాలని భావిస్తోంది. సంఘంలోని సభ్యుల్లో ఇంటర్ పూర్తి చేసిన మహిళలకు నెలరోజుల శిక్షణతోపాటు కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయం రుణం రూపంలో అందించాలని నిర్ణయించింది. దీంతో గ్రామాల్లో ప్రజలకు మీ సేవలు అందుబాటులోకి రావడంతోపాటు మహిళలకు ఉపాధి లభించనుంది.

మహిళలకు ప్రోత్సాహం..

మహిళా స్వయం సంఘాల బలోపేతం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు అందిస్తుండగా, తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల యూనిఫాం కుట్టు బాధ్యతలు అప్పగించింది. దీంతో స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆర్థికంగా చేయూత లభిస్తోంది. అలాగే ప్రస్తుతం ఊరికో మీసేవ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం, మహిళా సంఘాల్లోని సభ్యులకే మంజూరు చేయనుండడంతో మరింత బలోపేతం కానున్నాయి. కేవలం రుణాలు తీసుకోవడం, చెల్లింపులకే పరిమితం చేయకుండా, వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామైక్య సంఘాల పేరిట మహిళాశక్తి మీసేవా కేంద్రాలను మంజూరు చేయనుంది.

కేంద్రం ఏర్పాటుకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్, ఫర్నిచర్, ఇంటర్నెట్ కనెక్షన్, బయోమెట్రిక్ పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.2.50 లక్షల వరకు రుణం రూపంలో అందించనుంది. అలాగే ప్రైవేట్ భవనాల్లో అద్దెల భారం లేకుండా స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతువేదిక, అంగన్వాడీ లేదా ఇతర ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనుంది.

గ్రామీణ ప్రజలకు సేవలు..

జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 12 వేలకుపైగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1.35 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే యూనిఫాంల కుట్టు బాధ్యతలు అప్పగించగా, తాజాగా ఊరికో మీసేవ కేంద్రం మహిళా సంఘాల్లోని సభ్యులకు మంజూరు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని మహిళా స్వయం సంఘాల్లో ఇంటర్ పూర్తి చేసిన మహిళలకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు ఉండగా, మారుమూల గ్రామాల్లో ప్రజలు మీసేవల కోసం పట్టణ కేంద్రాలకు రావాల్సి వస్తుంది. దీంతో దూరభారంతోపాటు వ్యయ భారం తప్పడం లేదు. ఊరికో మీసేవ కేంద్రం ప్రారంభిస్తే ఆయా గ్రామాల్లోని ప్రజలకు దూర, వ్యయ భారం తప్పుతుంది.

'కడెం' పనులు త్వరగా పూర్తి చేయండి

- కలెక్టర్, అభిలాష అభినవ్



ప్రాజెక్టు గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

కడెం: కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ప్రాజెక్టును మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టు స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున సమస్యలు తలెత్తకుండా ఆపరేషన్ సిస్టం నిత్యం పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మెకానికల్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, స్కాడా వ్యవస్థతో ప్రాజెక్టు వచ్చే ఇన్‌ఫ్లోను అంచనా వేయవచ్చన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు ఉన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- ఆరోగ్య మిత్ర సేవలు ప్రతీ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ అభిలాష అభినవ్



రోగి కేస్ షీటు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యులు సమయపాలన పాటిస్తు, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్యులకు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర సేవల విభాగం, ల్యాబ్, డయాలసిస్ కేంద్రం, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలు, వృద్ధుల ఫిజియోథెరపీ, ఆరోగ్యశ్రీ, జనరల్ వార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సలకు సంబంధించి వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆసుపత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న వైద్యచికిత్సల వివరాలు రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్య మిత్ర సేవలు ప్రతీ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ విభాగాలకు సంబంధించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలకు సంబంధించి సమాచారాన్ని డిజిటల్ డిస్‌ప్లే చేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చికిత్స కోసం వచ్చే రోగులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఫిజియోథెరపీ, క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ రవీందర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీ ఎస్.ప్రసాద్, శ్రీనివాస్, దరహాస, అధికారులు ఉన్నారు.

ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయడంపై దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. సమీకృత అధికారుల కార్యాలయ సముదాయంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం మొదలైన దృష్ట్యా వ్యాధులు వ్యాపించకుండా అన్ని రకాల నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డాక్టర్ ఇంద్రిస్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ నయనరెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

'పెట్టుబడి' ఎవరికి ఇవ్వాలి

- 'రైతుభరోసా'పై అభిప్రాయ సేకరణ
- పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశాలు
- సహకార, వ్యవసాయ శాఖలకు ప్రభుత్వం ఆదేశం
- జిల్లాలో ముగిసిన సమావేశాలు



పెట్టుబడి సాయంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో అంజిప్రసాద్

నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు అందించే పెట్టుబడి సాయం ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేస్తోంది. గత బీఆర్ఎస్ సర్కారు గుట్టలు, చెట్లు, సాగులో లేని భూములకు సైతం పెట్టుబడి ఇచ్చిన నేపథ్యంలో రైతు భరోసా పథకం ద్వారా తాము అందించే పెట్టుబడి సాయంపై ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు తీసుకుంటోంది. తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం ఏటా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పంట రుణాల మాఫీకి కసరత్తు చేస్తున్న ప్రభుత్వం మరోవైపు పెట్టుబడి సాయంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో (పీఏసీఎస్) జనరల్ బాడీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి, అందులో ఉన్న సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని రాష్ట్ర సహకారశాఖ, రిజిస్ట్రార్ డైరెక్టర్ ఎం.హరిత ఈనెల 27న ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు రోజులు స్వీకరణ..

జూన్ 29 నుంచి వచ్చే జూలై 2వ తేదీలోపు ఒకే సెషన్‌లో సహకార సొసైటీల సర్వసభ్య సమావేశాలు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ, సహకార శాఖలను ఆదేశించారు. ప్రస్తుత వానాకాలం సాగు మొదలైనందున రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అర్హులకు సాయం అందించేందుకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. పంటలు సాగుచేస్తున్న నిజమైన రైతులకు మాత్రమే ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రత్యేక సమావేశాలు..

జిల్లాలో 16 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 53,725 మంది రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరితో భవిష్యత్‌లో రైతుభరోసా పథకం అమలు తీరుతెన్నులపై ముఖాముఖిగా చర్చించారు. జిల్లా వ్యవసాయ, సహకార సొసైటీల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ సమావేశాలు నిర్వహించారు. ఇందులో రైతుల సలహాలు, సూచనలు, రైతుభరోసా అమలుపై వారి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

ప్రత్యేక సమావేశాలు



పెట్టుబడిసాయం కోసం రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు జూన్ 29 నుంచి మంగళవారం వరకు పీఏసీఎస్ సొసైటీల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాం. పెట్టుబడి సాయం అర్హతపై సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న రైతుల అభిప్రాలను స్వీకరించాం. జిల్లా వ్యవసాయ, సహకార సొసైటీల సంయుక్త భాగస్వామ్యంతో సర్వసభ్య సమావేశాలు నిర్వహించాం. – అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్



అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక అర్బన్ ఎమ్మార్వో కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసపోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తుందని విమర్శించారు. గ్రూప్ 2, గ్రూప్ 3, నోటిఫికేషన్లు అదనంగా పోస్టులు పెంచాలన్నారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాలలో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కల్పించాలన్నారు. పోలీసు నియామకాలలో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో 46ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కొండజీ శ్రవణ్, బీజేవైఎం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్, బీజేపీ యువ నాయకులు మౌర్య చరణ్, సుంకరి సాయి, సోనూనాయక్, సంపత్, హరీశ్, రాహుల్ యువ మోర్చ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



అధ్యాపకులతో డీఐఈవో పరశురాం

తానూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఐఈవో పరశురాం సుచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. కళాశాలలో ఉన్న సమస్యల గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. సొంత భవనం లేక మూతబడిన బీసీ వసతి గృహంలో కళాశాలను నిర్వహిస్తుడడంతో విద్యార్థులకు తగిన సౌకర్యాలు లేవని తానూరుతో మంజూరైన కళాశాల భవనం నిర్మాణ పనులు సత్వరంగా ప్రారంభించేలా చూడాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి భవన నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సూచించారు.

ట్రిపుల్ ఐటీకి తగ్గిన పోటీ

- ఈ ఏడాది సగానికి పడిపోయిన దరఖాస్తులు
- వర్సిటీలో సమస్యలే కారణమంటున్న విద్యావేత్తలు
- నేడు ఎంపిక జాబితా విడుదల
- మెరిట్ విద్యార్థులకు సీట్లు
- ఈ ఏడాదైనా సమస్యలు లేకుండా చదువులు సాగేనా?

భైంసా: బాసర ట్రిపుల్ఐటీలో 2024–25 విద్యా సంవత్సరంలో 1500 సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జూన్ 1 నుంచి 22 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా విద్యార్థుల జాబితాను రూపొందించారు. మెరిట్ విద్యార్థుల జాబితాను బుధవారం క్యాంపస్లో విడుదల చేయనున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న వివరాలు బుధవారం వెల్లడిస్తామని ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఎప్పటికప్పుడు తెలిపేవారు. కానీ ఈ సారి ఆ సంఖ్య వివరాలను గోప్యంగా ఉంచుతూ దాదాపుగా 15 వేలు వచ్చాయని చెప్తున్నారు. దరఖాస్తుల సంఖ్య వివరాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే విషయం తెలియడం లేదు.

విద్యావిధానం...

ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ ఆధారంగా బాసర ట్రిపుల్ఐటీలో బోధన కొనసాగుతుంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును నేర్పిస్తారు. అనంతరం మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్లో కోర్సులు కేటాయిస్తారు. ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్ఐటీ అధికారులు ప్రభుత్వం తరఫున వసతులు కల్పిస్తారు. ల్యాప్టాప్, ఒకే రకమైన దుస్తులు, షూస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి కల్పిస్తారు.



బాసర ట్రిపుల్ఐటీ

గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థుల జీపీఏ, సామాజిక వర్గం, ఇలా అన్నింటినీ లెక్కలోకి తీసుకుని సీట్లు కేటాయించనున్నారు.

నేడు ఎంపిక...

ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను అధికారుల బృందం పూర్తిస్థాయిలో పర్యవేక్షించింది. ఇందులో మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తామని, ఆన్లైన్లో వివరాలు ఉంచుతామని అధికారులు పేర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా ట్రిపుల్ఐటీ విడుదలచేసే జాబితా కోసం ఎదురుచూస్తున్నారు. జాబితా విడుదలైతే ట్రిపుల్ఐటీలో నిర్వహించే కౌన్సెలింగ్కు హాజరయ్యేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

పర్యవేక్షణ కరువు...

అంతా బాగున్న బాసర ట్రిపుల్ఐటీలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. అన్ని శాఖల్లో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ చదివే విద్యార్థులు సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. స్టూడెంట్ కమిటీని కూడా ఎన్నుకోకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రిపుల్ఐటీలో ఏంజరిగినా బయటకు చెప్పకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఏ విషయం బయటకు వచ్చినా అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అక్కడంతా బాగుంటే బయట సమాజానికి ఏం చెప్పకపోయినా నష్టమేం ఉండదు. కానీ హాస్టల్ వసతి మొదలుకుని భోజనాల వరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతునే ఉన్నారు. హాస్టల్ గదుల్లో, చాలా చోట్ల పెచ్చులూడుతున్నాయి. రంగులు లేక భవనాలు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లు సరిచేయడం లేదు. చాలా చోట్ల హాస్టల్ గదులకు నీళ్లు రావడం లేదు. ఫ్యాన్లు తిరగడంలేదు. ఫర్నిచర్ సరైన రీతిలో లేదు. ఇక మెస్లలో భోజన వసతి అయితే చెప్పాల్సిన అవసరం లేదు. మరోవైపు సరిహద్దు మహారాష్ట్రలో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీ దుర్గంధం క్యాంపస్ను కమ్మేస్తుంది. విష వాయువులతో నిండిన గాలినే విద్యార్థులు పీలుస్తున్నారు. ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల నిరవధిక నిరసనలతో అప్పటి మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ క్యాంపస్కు వచ్చి విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారినా ఇక్కడి సమస్యలు మాత్రం తీరలేదు. ట్రిపుల్ఐటీ సమస్యలపై సీఎం రేవంత్రెడ్డి దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ట్రిపుల్ఐటీ సమస్యలు లేకుండా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతంతో పోలిస్తే...

బాసర ట్రిపుల్ఐటీకి మూడేళ్లుగా వచ్చిన దరఖాస్తులను పోల్చిచూస్తే ఈ ఏడాది అధికారులు చెప్పిన సంఖ్య సగానికి తగ్గిందనే చెప్పవచ్చు. 2020–21లో 32 వేలు, 2021–22లో 20,178, 2022–23లో 31,432, 2023–24లో 32,635 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈ విద్యాసంవత్సరంలో కేవలం 15వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాసర ట్రిపుల్ఐటీలో సీట్ల కోసం గతంలో వందలాది మంది విద్యార్థులు పోటీపడేవారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులను బట్టిచూస్తే ఒక్కో సీటుకు పది మంది మాత్రమే పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



మహేందర్(ఫైల్)

ఇంద్రవెల్లి: గత నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరపూర్ గ్రామానికి చెందిన కోట్నాక్ ఆనంద్రావ్, గిరిజబాయి దంపతుల కుమారుడు కోట్నాక్ మహేందర్ (17) ఇంద్రవెల్లిలోని క్రీసెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11న బైక్పై ఇంద్రవెల్లి నుంచి గౌరపూర్ వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి ఆనంద్రావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి జైలు

భైంసాటౌన్: లైంగిక దాడికి యత్నించిన కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు రికార్డు అసిస్టెంట్ చంద్రకాంత్ తెలిపారు. 2018లో కుభీర్ మండల కేంద్రానికి చెందిన గోనిగర్ సాయినాథ్ అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుభీర్ ఎస్సై కేసు నమోదు చేయగా భైంసా కోర్టులో విచారణ జరిపారు. ఏపీపీ అరుణ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు

ఆసిఫాబాద్అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ అంజన్న తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దినకర్ సునీల్ 2021 ఆగస్టు 27న ఆటోలో 25 కిలోల 300 గ్రాముల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. అప్పటి ఐఓలు తిరుపతి, హనూక్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్రావ్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

భైంసాటౌన్: బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో సుభాష్ను మంగళవారం కలిసి విన్నవించారు. ఏళ్లుగా బదిలీ కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులకు ప్రస్తుతం బదిలీ చేసినా రిలీవ్ చేయడం లేదన్నారు. దీంతో ఇతర ఉపాధ్యాయుల స్టేషన్ సర్వీస్ తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, నాయకులు శంకర్, రవి జాదవ్, సాగర్ ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు నేడే ఆఖరు

ఆదిలాబాద్రూరల్: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ 2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష కోసం అందించనున్న ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగియనుందని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పాసై ఆసక్తి కలిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 7న ఆన్లైన్ ద్వారా స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన వారికి ఈ నెల 18 నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08732–221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



చిన్నయ్య మృతదేహం

బోథ్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి చిన్నయ్య (59)మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూతన చట్టం ప్రకారం బీఎన్ఎస్ ఎస్194 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లేఅవుట్లోని అక్రమ రోడ్డు ధ్వంసం

కైలాస్నగర్: మావల మండల కేంద్రంలోని చెరువును ఆనుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన ఓ లేఅవుట్లోని రోడ్డును బల్దియా అధికారులు ధ్వంసం చేశారు. బఫర్ జోన్లో సదరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చెరువుకట్టను ఆనుకుని లేఅవుట్కు వెళ్లేలా రోడ్డును ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ అధికారులు నిర్దేశించిన చెరువు స్థలాన్ని లేఅవుట్లో కలుపుకుంటూ ఈ రోడ్డును నిర్మించారు. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న బల్దియా సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఈ రోడ్డును జేసీబీలతో ధ్వంసం చేయించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు బఫర్జోన్లలో లేఅవుట్ల ఏర్పాటు చట్ట విరుద్ధమని, అలాంటి వాటిపై కఠినంగా వ్యవహరిస్తామని టీపీవో పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్లను సహించబోమని స్పష్టం చేశారు.



బల్దియా అధికారులు తొలగించిన రోడ్డు

ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం

కడెం/మామడ: కడెం, మామడ మండలాల్లోని ఉపాధి హామీ పనులను కేంద్ర జలశక్తి అభియాన్ టీం సభ్యులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మితో కలిసి మంగళవారం పరిశీలించారు. కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామంలో చేపల చెరువు, మద్దిపడగ గ్రామంలో పెర్కులేషన్ ట్యాంక్ తదితర పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మామడ మండలం కొరిటికల్, లింగాపూర్ గ్రామాలలో కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అనిత, సాంకేతిక అధికారి సుశాంత్కుమార్ రాతాలు పరిశీలించారు. కొరిటికల్లో వాటర్షెడ్, లింగాపూర్లో పానికి వనం, నర్సరీలను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. భూగర్భ జలాల పెంపునకు చేపడుతున్న పథకాలను తెలుసుకుని సూచనలు చేశారు. ఇందులో సెంట్రల్ టీం సభ్యులు అనిత, సైంటిస్ట్ సుశాంత్, సీసీ గంగాప్రసాద్, ఏపీవో జయదేవ్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఉపాధిహామీ సిబ్బంది కాంతారావు, శ్రీనివాస్, గణేశ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్, తదితరులున్నారు.



మొక్కను నాటుతున్న అధికారులు

'అడెల్లి' అమ్మవారి చెంత అపశ్రుతి

- విస్తరాకులు తెంపడానికి వెళ్లి వ్యక్తి మృతి

సారంగాపూర్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద మంగళవారం అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో తినడానికి విస్తరాకులు తెంపడానికి వెళ్లిన వ్యక్తి ఫెన్సింగ్పై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. కౌట్ల(బి) గ్రామానికి చెందిన కాసారం భీమన్న (50) గ్రామస్తులతో కలిసి అడెల్లి ఆలయానికి వెళ్లాడు. అందరితో కలిసి పండుగ వాతావరణంలో ఉల్లాసంగా గడిపాడు. అన్నం తినే సమయంలో విస్తరాకులు అందుబాటులో లేకపోవడంతో హరితవనంలో ఉన్న మోదుగచెట్టు ఆకులు తెచ్చేందుకు వెళ్లాడు. పార్కు ఫెన్సింగ్ పైకి ఎక్కిదిగే క్రమంలో కాలు జారి రాయిపై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సల్ల శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కాసారం భీమన్న మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయాలైన రాజేశ్వర్

దిలావర్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సిర్గాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప రాజేశ్వర్ దిలావర్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం విధులు ముగిసిన అనంతరం భారీ వర్షం కురియడంతో కార్యాలయంలోనే చీకటి పడేంత వరకు ఉన్నాడు. ఆతర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో ద్విచక్ర వాహనంపై సిర్గాపూర్ బయలు దేరాడు దిలావర్పూర్ బస్టాండ్ దాటి కొద్దిదూరం వెళ్లాక రోడ్డుకు అడ్డంగా ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. వెంటనే వెనుక నుంచి వచ్చిన డీసీఎం సైతం రాజేశ్వర్ బైక్ను ఢీకొంది. దీంతో ఎగిరి రోడ్డు పక్కన పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నామమాత్రపు ధరలకే మొక్కలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఐటీడీఏ పరిధిలోని 4 ఉద్యాన నర్సరీలలో నాణ్యమైన మామిడి మొక్కలు, అలంకరణ మొక్కలు నామమాత్రపు ధరలకే అందుబాటులో ఉన్నాయని పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, మంచిర్యాల జిల్లా భీమారం, బెల్లంపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగా ఉద్యాన నర్సరీలలో ఆయా మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి మొక్క రూ.50, క్రోటాన్స్, అలంకరణ మొక్కలు రూ.20, మునగ, కరివేపాకు మొక్కలు రూ.20 చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులకు, రైతు సంఘాలకు, స్వచ్ఛంద సంస్థలకు విక్రయించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇంకా ఇతర రకాల మొక్కలు అవసరమున్నట్లయితే ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఇతర రాకల మొక్కలు అవసముున్నట్లయితే ఉత్పత్తి చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఉద్యాన అధికారిని 9032313933 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్సీలో ఊడిపడిన టైల్స్

- తాత్కాలిక ఉద్యోగికి గాయాలు

కుంటాల: కుంటాల పీహెచ్సీలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న మిర్యాల రవీందర్కు మంగళవారం గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే రవీందర్ ఉదయం 6:30 గంటల ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాలలో శుభ్రం చేస్తుండగా పైనుంచి టైల్స్ ఊడిపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

266 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఆదిలాబాద్టౌన్: అక్రమంగా నిల్వ ఉంచిన 266.76 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల గోదాంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన 266 క్వింటాళ్ల 76 కిలోల పీడీఎస్ రేషన్ బియ్యంను లభ్యమయ్యాయి. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన ముజాహిద్ అనే వ్యాపారి వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గోదాంలో ఉంచిన బియ్యాన్ని పరిశీలించి తూకం వేయించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. బియ్యానికి పంచనామా నిర్వహించి సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టూటౌన్ సీఐ అశోక్, సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్, పోలీసు సిబ్బంది నరేష్, రమేశ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నిల్వలతో డీఎస్పీ, పోలీసులు

జవాన్గా.. జానపద కళాకారుడిగా..!

- గీతాల రూపకల్పనలో తనదైన శైలి
- సమాజాన్ని చైతన్య పరుస్తున్న శేఖర్

కుంటాల: బాల్యం నుంచే రచనలు.. పాటలు పాడుతూ.. నటిస్తూ రాణిస్తున్నాడు కుంటాల మండలంలోని మెదన్పూర్ గ్రామానికి చెందిన దర్శనం శేఖర్. జవాన్గా దేశ సేవ చేస్తూ సెలవుల్లో వచ్చినప్పుడు ఇంటికి వచ్చినప్పుడల్లా సమాజంలోని మార్పులకనుగుణంగా తన కళలతో ప్రజలను చైతన్య పరుస్తున్నాడు.

చిన్ననాటి నుంచి కళలపై మక్కువ..

కుంటాల మండలంలోని మెదన్పూర్ గ్రామానికి చెందిన దర్శనం పీరాబాయి–పోశెట్టి దంపతుల రెండో కుమారుడు దర్శనం శేఖర్. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశాడు. పాఠశాలలో స్వాతంత్ర్య, గణతంత్ర, వార్షికోత్సవాల్లో భాగంగా తనకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. తాను రచించిన పాటలు పాడుతూ.. నటిస్తూ అందరి దృష్టి ఆకర్షించాడు. దేశభక్తి, జానపద పాటలు రాసి తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు. 2010లో ముంబైలో నిర్వహించిన ఎన్సీసీ జాతీయ సదస్సులో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి అప్పటి కల్నల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కరీంనగర్లో స్వర్ణ పతకం సాధించారు. అమ్మా నీరూపమా.. ఆల్బమ్ ద్వారా పేరు సంపాదించి.. ఆకాశవాణిలో పాడిన పాటలకు శ్రోతల మెప్పు పొంది గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రముఖ గాయకుడు అంజయ్య స్ఫూర్తితో రచయితగా గుర్తింపు పొందాడు. 2012లో బీఎస్సీ పూర్తిచేసిన ఆయన ఆర్మీలో ఉద్యోగం సంపాదించాడు. ఆర్మీలో నర్సింగ్ టెక్నీషియన్గా చండీగఢ్, ఉదంపూర్, డెహ్రాడూన్లో వైద్య సేవలు అందిస్తూ ప్రస్తుతం పూణేలో విధులు నిర్వర్తిస్తున్నారు. 'గల్లు..గల్లుమన్నా.. నీచేతిగాజులు' సీడీని మాజీమంత్రి ఐకే రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అమ్మా నీ రూపమా.. గుండెకు గుచ్చిన.. గాయం నువ్వేనా.. లవ్ ఫెయిల్యూర్.. చంపేస్తుంది నన్ను.. ఇలాంటి 3 వేలకు పైగా సీడీలు రూపొందించారు. తెలంగాణ ఉద్యమంలో తన గొంతుకను వినిపించి ఉద్యమకారులను చైతన్య పరిచారు. పల్లెల్లోని వాతావరణం, సంప్రదాయం, దేశభక్తితో సమాజాన్ని ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ అన్నీతానై రాణిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.



సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

ప్రత్యేకత చాటాలని...



చిన్నప్పటి నుంచి పాటలు పాడడం, రాయడం, నటించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. నన్ను అందరూ ప్రోత్సహించారు. దేశ సేవ చేస్తూ జరుగుతున్న పరిస్థితులపై సీడీల ద్వారా రూపొందించడంతో అభిమానులు ఆశీర్వదించారు. ప్రత్యేకత ఉండాలని నిరంతరం కృషి చేస్తున్నా.

– దర్శనం శేఖర్, ఆర్మీ జవాన్

'రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత

ఎదులాపురం: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్మెంటు బెనిఫిట్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సుమారు 10 వేల మంది ఉన్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని గతేడాది 24 రోజులపాటు నిరవధిక సమ్మెను నిర్వహించగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విరమించామన్నారు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హామీని పరిగణలోకి తీసుకోకుండా టీచర్లకు లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు మాత్రమే అందజేస్తామని నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. వెంకటమ్మ, సునీత, రమేశ్, సోమన్న, బొజ్జ ఆశన్న, కిరణ్ పాల్గొన్నారు.